క్లుప్తంగా

బియ్యం అందజేత



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని షిర్డిసాయిబాబా ఆలయం 23వ వార్షికోత్సవం సందర్భంగా నేడు(సోమవారం) నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి ఎస్ఎస్‌తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఒక క్వింటా బియ్యం, 50 కిలోల కందిపప్పును అందజేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్ తెలిపారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు, అర్చనలు, తీర్థ ప్రసాదాల వితరణ, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గంజి రమేష్, బచ్చు సత్యనారాయణ, చెన్న ముత్తయ్య, బచ్చు సత్యం, పర్వతాల కుమార్, బట్టు రమేష్, తిరుపతి, మాధవ్, వెంకట్రావు, అర్చకులు భానుప్రకాష్‌శర్మ పాల్గొన్నారు.

వాహనాలు ఢీ..

మొగుళ్లపల్లి: ఎదురెదురుగా వస్తున్న రెండు వాహనాలు ఢీకొన్న సంఘటన మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని ఇండియన్ పెట్రోల్‌బంక్ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం జమ్మికుంట మండలం గండ్రపల్లికి చెందిన కారు కోటంచ నుంచి జమ్మికుంటకు, మొగుళ్లపల్లి మండలం ఇస్సిపేటకు చెందిన అనుముల రాయమల్లు కారు ఇల్లంతకుంట నుంచి మొగుళ్లపల్లికి వస్తుంది. ఈ క్రమంలో పెట్రోల్ బంక్ సమీపంలో ఎదురుఎదురుగా ఢీకొనగా ఐదుగురికి స్వల్ప గాయాలు అయినట్లు స్థానికులు తెలిపారు. సీటు బెల్ట్ పెట్టుకోవడం వల్ల ప్రమాదం తప్పింది.

నేడు 'మే డే'పై సదస్సు

భూపాలపల్లి అర్బన్: మే డే ఘటనపై నేడు (సోమవారం) ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్థానిక కొమురయ్య భవనంలో సదస్సు నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ బ్రాంచీ కార్యదర్శి మోటపలుకుల రమేష్ తెలిపారు. ఆదివారం కొమురయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రమేష్ మాట్లాడుతూ.. చికాగో నగరంలో మొట్టమొదటిసారి పని గంటల విషయంలో కార్మికులు తిరుగుబాటు చేశారని ఆ తిరుగుబాటే మేడేగా జరుపుకుంటున్నామని అన్నారు. ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న మేడేను నూతన కార్మికులకు తెలియజేసే విధంగా మే డే సంఘటన విజయాలపై ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు గురిజేపల్లి సుధాకర్‌రెడ్డి, మధు, విజేందర్, కృష్ణమూర్తి, పోషం, వెంకటేష్ పాల్గొన్నారు.

పరామర్శ



ములుగు రూరల్: మండలంలోని కొత్తూరు గ్రామంలో ఇటీవల అగ్ని పమాదంలో సర్వం కోల్పోయిన కస్తూరి లక్ష్మి, కస్తూరి ఐలేష్, నాగార్జున కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ యూత్ అధ్యక్షుడు ధనసరి సూర్య ఆదివారం పరామర్శించారు. బాధిత కుటుంబాలకు భరోసా కల్పించారు. ఆయన వెంట ఎర్రబెల్లి దేవేందర్‌రావు, మండి మధు, దేవరనేని నేపాల్ రావు, దండు అశోక్, కోరే సుమన్, రవీందర్, సమ్మిరెడ్డి, అక్కల మల్లయ్య తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

భూపాలపల్లి రూరల్: విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన సంఘటన భూపాలపల్లి మండలంలోని గుర్రంపేట గ్రామంలో ఆదివారం చోటు చేసుకొంది. గ్రామస్తులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఎండీ అంకూస్‌కు చెందిన గేదె మేత మేసి ఇంటికి వస్తున్న క్రమంలో గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్తు వైరు తగిలి షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని బాధితుడికి ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

రోడ్డు నిర్మాణం పూర్తయ్యేనా?

- మధ్యలోనే నిలిచిన పనులు..
- కొంత మేర రాని అటవీశాఖ అనుమతులు
- తారు రోడ్డుపై తేలిన పగుళ్లు



కంకర పోసి ఉన్న రోడ్డు

వాజేడు: మండల పరిధిలోని ఏడ్జర్లపల్లి నుంచి గుమ్మడిదొడ్డి గ్రామం వరకు ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన కింద 12 కిలో మీటర్ల మేర డబుల్ రోడ్డు మంజూరైంది. ఈ రహదారి నిర్మాణానికి రూ.13 కోట్ల 65 లక్షల 18 వేలు కేటాయించగా కాంట్రాక్టర్ పనులను 2022 డిసెంబర్ 21న ప్రారభించారు. 2023 మే 20 నాటికి పనులను పూర్తి చేయాల్సి ఉంది. కాని పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. రహదారి పనుల్లో పురోగతి లేక పోవడం అటు కాంట్రాక్టర్ ఇటు ఇంజనీరింగ్ అధికారులు పట్టించు కోక పోవడంతో పనులు పూర్తి చేస్తారా? లేదా? అనే అనుమానాలు ప్రజల్లో ఉన్నారు.

రాని అనుమతులు..

రహదారి నిర్మాణంలో ఉన్న స్థలం కొంత రిజర్వ్ ఫారెస్టులో ఉంది. దీని అనుమతి కోసం నివేదికలను పపించినప్పటికీ ఇంత వరకు అనుమతులు రాలేదు. ఈ అనుమతులు రాక పోవడంతో మండలకేంద్రం నుంచి డబుల్ బెడ్రూమ్ ఇళ్ల వరకు రహదారి పనులు నిలిపి వేశారు. అనుమతులు వచ్చేది ఎప్పుడూ? పనులు పూర్తి అయ్యేది ఎప్పుడో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

మెటల్ వేసి వదిలేశారు

మండల పరిధిలోని పూసూరు నుంచి ఎడ్జర్లపల్లి గ్రామం చివరి వరకు రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా మెటల్ వేశారు. దానిని రోలింగ్ చేసి తారు వేయాల్సి ఉంది. కాని ఇంత వరకు దాని ఊసే లేదు. నిర్మాణ కాలం గడిచి పోయి సంవత్సరం కావస్తున్నప్పటికీ పనులు చేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.



కల్వర్టు వద్ద మట్టి రోడ్డు

అసంపూర్తిగా కల్వర్టులు, బ్రిడ్జిలు

12 కిలో మీటర్ల రహదారి నిర్మాణంలో భాగంగా పూసూరు, ఏడ్జర్లపల్లి గ్రామాల మధ్యన రెండు కల్వర్టులను నిర్మించారు. మరో రెండు చోట్ల కల్వర్టుల పనులను ప్రారభించలేదు. వాజేడు, గుమ్మడిదొడ్డి గ్రామాల మధ్యన హైలెవెల్ వంతెనెతో పాటు కొంగాల వాగుపై బ్రిడ్జిని నిర్మించారు. కొంగాల వాగు బ్రిడ్జి సమీపంలో ఏడ్జర్లపల్లి, పూసూరు గ్రామాల మధ్యన నిర్మించిన కల్వర్టుల వద్ద ఇంకా మట్టి రోడ్డు దర్శనమిస్తుంది. మెటల్ వేయక పోవడంతో గుంతల మయంగా మారిన రహదారి ప్రమాదకరంగా ఉంది. అలాగే కొంత మేర వేసిన తారు రోడ్డు వేశారు. కాగా కొంగాల వాగు వద్ద నుంచి గుమ్మడిదొడ్డి గ్రామం వరకు వేసిన తారు రోడ్డు చాలా చోట్ల పగుళ్లు తేలింది. వర్షాలు పడగానే రహదారి దెబ్బతినే అవకాశాలు ఉన్నయని స్థానికులు వాపోతున్నారు. నాణ్యతా లోపించిన కారణంగానే తారు రోడ్డు పగుళ్లు తేలిందని అంటున్నారు.

ప్రారంభం కాని పనులు

ఈ రోడ్డులోనే మండల కేంద్రం సమీపంలో రూ.4.85 కోట్ల వ్యయంతో హైలెవెల్ బ్రిడ్జిని నిర్మించారు. బ్రిడ్జి నిర్మాణం ఎత్తుగా నిర్మించడంతో ఇక్కడ కంకర వేసి మెటల్ పోశారు. కాని రహదారికి ఇరు వైపుల గోడ లేదా రాయితో రివిట్‌మెంట్ చేయాల్సి ఉంటుంది. ఇంత వరకు ఆ పనులను మొదలు పెట్టలేదు. వర్షాలు పడితే రహదారి మొత్తం కొట్టుకు పోయే ప్రమాదం ఉంది. గత సంవత్సరం వర్షాల సమయంలో పనులు మొదలు పెట్టడంతో వందలాది మంది రైతులు జగన్నాథపురం మీదుగా చుట్టూ తిరిగికి వచ్చి పంటలను సాగు చేసుకున్నారు.



ఫారెస్ట్ అనుమతి లేక నిలిచిన రహదారి



అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులు



పగుళ్లు తేలిన తారురోడ్డు

విద్యుత్ ఉచ్చులు అమర్చితే పీడీయాక్ట్



మాట్లాడుతున్న సీఐ రాజేశ్వర్‌రావు

కాళేశ్వరం: అడవిలో విద్యుత్ తీగలతో ఉచ్చులు అమర్చితే పీడీయాక్టు నమోదు చేసి జైలుకు పంపుతామని మహదేవపూర్ సీఐ రాజేశ్వర్‌రావు, కాళేశ్వరం ఎస్సై భవానిసేన్ హెచ్చరించారు. ఆదివారం మహదేవపూర్ మండలం కాళేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధి చంద్రుపల్లి గ్రామంలో ఎస్పీ కిరణ్‌ఖరే, కాటారం డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి ఆదేశాలతో పోలీసు, అటవీ, విద్యుత్‌శాఖ అధికారులు గ్రామస్తులతో సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వణ్యప్రాణుల వేట నియంత్రణ కోసం తీసుకోవాల్సిన చర్యలు, అనుసరించాల్సిన అంశాలపై గ్రామస్తులతో చర్చించారు. అటవీ ప్రాంతంలో వణ్యప్రాణుల వేట కోసం విద్యుత్ తీగలు, ఉచ్చులు బిగించరాదని హెచ్చరించారు. వణ్యప్రాణులను వేటాడే వారి, మాంసం విక్రయించే వారి వివరాలు తెలియజేయాలని తెలిపిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని అన్నారు. ఇప్పటికే బైండోవర్ చేసిన వ్యక్తులు మళ్లీ వేటకు వెళ్లితే పీడీ యాక్టులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. విద్యుత్ వైర్లు, ఉచ్చుల కారణంగా వణ్యప్రాణులు, మూగజీవాలతో పాటు అమాయక ప్రజలు, రైతులు చనిపోయే అవకాశం ఉందని పలు ఘటనలను వివరించారు. ఈ కార్యక్రమంలో మహదేవపూర్ రేంజర్ కమలాదేవి, బీట్ ఆఫీసర్ శ్రీను, ఎన్పీడీసీఎల్ లైన్ ఇన్‌స్పెక్టర్ సదానందం, కార్యదర్శి సురేష్, పోలీసు, అటవీ, విద్యుత్ ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'జనజాతర'ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మొగుళ్లపల్లి: రేగొండలో ఈ నెల 30న నిర్వహించే కాంగ్రెస్ పార్టీ జన జాతర సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు రఫీ, బీసీ సెల్ అధ్యక్షుడు కత్తి సంతోష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఓనపాకల ప్రసాద్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. సభకు సీఎం రేవంత్ రెడ్డి హాజరవుతున్న సందర్భంగా మండలంలోని కాంగ్రెస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. అన్నారు. ఆగస్టు 15లోపు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయనుందని పేర్కొన్నారు. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వరంగల్ పార్లమెంటు అభ్యర్థి కడియం కావ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి మండ రవీందర్, దండ వెంకటేశ్వర రెడ్డి, తక్కళపల్లి రాజు, ఎర్రబెల్లి పున్నం చందర్‌రావు, గుండారపు తిరుపతి, బండారి రాజు, రాజేశ్వరరావు, బద్దం మోహన్ రెడ్డి, ఎలేటి నరసింహారెడ్డి బండారు కొమురయ్య, బండారి భిక్షపతి, గాజుల పరుశు రాములు, కుమార్, శివాజీ పాల్గొన్నారు.

బలరాంనాయక్‌ను గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకన్న

ఏటూరునాగారం: కార్యకర్తలు గడప గడపకు ప్రచారం చేసి ప్రభుత్వ పథకాలు వివరించి పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా బలరాం నాయక్‌ను గెలిపించాలని కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండీ అయూబ్ ఖాన్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అధ్యక్షతన కార్యకర్తల బూత్ లెవల్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టు 15లోపు రైతు రుణమాఫీ చేస్తున్నాడని ఆ విషయాన్ని ప్రజలకు తెలపాలన్నారు. బలరాం నాయక్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు గుడ్ల దేవేందర్, ఖలీల్ ఖాన్, నాయకులు వావి లాల ఎల్లయ్య, గంపల శివ, లాలయ్య, వావిలాల నర్సింగరావు, దేవులపల్లి విజయకుమార్, కట్కూరి రాధిక, సులేమాన్, మధు, సరికొప్పుల శ్రీనివాస్, గౌస్, అక్షిత్, నవీన్, ఎండీ సిరాజ్, అక్బర్, లక్కీ, భాగ్య, రంజిత్, గోపాల్, హరికృష్ణ, గోపాల్, రమ, ఉదయ, ఫరూక్, తరుణ్, నాగరాజు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

మొగుళ్లపల్లి: మండలంలోని రంగాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించిన 2005–06 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి పూర్వవిద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చదువు నేర్పి ప్రయోజకులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను శాలువాలు కప్పి మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గతంలో జరిగిన జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ.. పాత తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరయ్య, చంద్రశేఖర్‌రావు, భాస్కర్, మంజుల, రాజేశ్వర్‌రావు, గణపతిరెడ్డి, మార్కండయ్య, అటెండర్ అశోక్, పూర్వ విద్యార్థులు రమేష్, జగన్‌మోహన్, సునిల్, సురేష్, సతీష్, రమాదేవి, వనిత, మమత, చామంతి అఖిల, ధనలక్ష్మి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి



పార్టీలో చేరిన వారితో సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. నియోజక వర్గంలోని గణపురం, చిట్యాల మండలాల నుంచి పలు పార్టీలకు చెందిన కార్యర్తలు, నాయకులు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఆరు గ్యారంటీల్లో ఐదు పథకాలు అమలు అవుతున్నాయనిన్నారు. ఎన్నికల తర్వాత మిగితా పథకాలు అమలవతాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్యను అత్యధిక మెజారిటీతో గెలిపించడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కత్తి వెంకటస్వామి, టేకుమట్ల జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, వివిధమండలాల నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలి



మాట్లాడుతున్న గండ్ర వెంకటరమణా రెడ్డి

రేగొండ : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సుధీర్ కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పోనగండ్ల, కాకర్లపల్లి, లింగాల గ్రామాల్లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మాయమాటలతో కాలం గడుపుతోందన్నారు. నియోజకవర్గంలో అకాల వర్షాలకు చెరువులు, కుంటలు తెగిపోతే మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేస్తే ఇప్పటి వరకు మరమ్మతులు చేయలేదని విమర్శించారు. చెరువులన్ని ఎండిపోయి ముదిరాజ్‌లు ఉపాధి కోల్పోయారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అంకం రాజేందర్, ప్రధాన కార్యదర్శి గంపల లింగయ్య, మాజీ సర్పంచులు కుసుంబ రంజిత్, మామిడిశెట్టి విజయమహేందర్, సీనియర్ నాయకులు కుందూరు విద్యాసాగర్‌రెడ్డి, కొల్గూరి రాజేశ్వర్‌రావు, మాదాడి కరుణాకర్ రెడ్డి, హింగే మహేందర్ యూత్ నాయకులు పోగు సుమన్, పేరాల ప్రశాంత్ రావు, మాడగాని నరేష్, అనుష్‌రెడ్డి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి



బస్సును తనిఖీ చేస్తున్న ఎస్సై ప్రసాద్

చిట్యాల: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని ఎస్సై గొగికారి ప్రసాద్ అన్నారు. ఆదివారం మండలంలోని గర్మిళ్లపల్లి చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ నిబంధనల మేరకు ఎవరైనా రూ.50 వేల కంటే ఎక్కువగా తరలిస్తే సీజ్ చేస్తామని అన్నారు. ఒక వేళ ఎక్కువ డబ్బులు తీసుకెళ్తే ఆధారాలు చూపించి తీసుకెళ్లాలని అన్నారు. అలాగే వాహనదారులు ప్రతి ఒక్కరూ ధ్రువీకరణ పత్రాలను ఉంచుకోవాలని కోరారు. ఆయన వెంట ఏ ఎస్సై అమరేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

సెల్‌ఫోన్ అందజేత



సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్సై, సిబ్బంది

కాళేశ్వరం: కాళేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బాధితుడికి ఆదివారం ఎస్సై భవానిసేన్ అందజేశారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కాళేశ్వరం గ్రామానికి చెందిన నీలం శ్రీకాంత్ ఫోన్‌ను కాళేశ్వరం బస్టాండ్ ఏరియాలో పోగొట్టుకున్నాడు. దీంతో పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను గుర్తించి రికవరీ చేసి ఆదివారం బాధితునికి ఎస్సై, సిబ్బంది అప్పగించారు.

పోచమ్మ తల్లికి బోనాలు

టేకుమట్ల: మండలంలోని వెలిశాల గ్రామంలో పోచమ్మ తల్లి బోనాల వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనంతో డప్పుచప్పుల్ల మధ్య అమ్మవారి ఆలయానికి తరలివెళ్లారు. పోచమ్మ తల్లికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చింతలపల్లి విజయస్వామి రావు, ఆలయ చైర్మన్ దామరవేని నారాయణరావు, ఎంపీటీసీ గంధం వజ్రసారయ్య, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆలయ పరిసరాల్లో మద్యం తాగొద్దు



వెంకటాపురం(ఎం): రామప్ప పరిసర ప్రాంతాల్లో మద్యం సేవించి పర్యాటకులకు, భక్తులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని వెంకటాపురం ఎస్సై చల్లా రాజు హెచ్చరించారు. రామప్ప దేవాలయ పరిసర ప్రాంతాల్లో మద్యం తాగొద్దని, సరస్సులో ఈత కొట్టి ప్రాణాలు కోల్పోవద్దని వెంకటాపురం పోలీసుల ఆధ్వర్యంలో పలుచోట్ల ఆదివారం ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై రాజు మాట్లాడుతూ.. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయానికి భక్తిభావంతో వచ్చి రామప్ప రామలింగేశ్వరున్ని దర్శించుకోవాలే తప్ప వీకెండ్ పేరుతో పార్టీలు ఏర్పాటు చేసుకొని మద్యం సేవించి ఇతర వ్యక్తులను ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు. అదేవిధంగా మండలంలోని లక్ష్మీదేవిపేటలో పోలీసు సిబ్బందితో కలిసి ఎస్సై రాజు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు.

ఆదివాసీ సమస్యలపై పోరాటం చేస్తా..



ప్రచారం చేస్తున్న మైపతి అరుణ్ కుమార్

వెంకటాపురం(కె): తనను ఎంపీగా గెలిపిస్తే ఏజెన్సీలోని ఆదివాసీల సమస్యలపై పోరాటం చేసి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మహబూబాబాద్ పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థి మైపతి అరుణ్ కుమార్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ముత్తారం, సీతరామ్‌పురం, పెంకవాగు, కొత్తగుంపు గ్రామాల్లో పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఒక్క అవకాశం ఇచ్చి ఎంపీ గెలిపిస్తే ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. గిరిజన గ్రామాల్లో రోడ్లు, తాగు నీరు తదితర సౌకర్యాలు కల్పించేందుకు పోరాటం చేస్తానని అన్నారు. ఆయన వెంట గిరిజన సంఘాల నాయకులు పూనెం సాయి, సుభద్ర ఉన్నారు.

నాటుడు.. నరుకుడు!

- అవెన్యూ ప్లాంటేషన్ చెట్ల నరికివేత
- విద్యుత్ తీగలకు అడ్డు రావడంతో తొలగింపు




జగ్గయ్యపేట, సుల్తాన్‌పూర్ మధ్య బీటీ రోడ్డు పక్కన నరికిన చెట్లు

రేగొండ: రోడ్డు పక్కన అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా ఈజీఎస్ కూలీలతో గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో మొక్కలను నాటి పెంచుతున్నారు. విద్యుత్ తీగలకు అడ్డుగా రావడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో అధికారులు చెట్లను నరికి వేస్తున్నారు. దీంతో మొక్కను నాటి చెట్టుగా పెంచటానికి అయ్యే ఖర్చు వృథాగా పోతుంది. మొక్కలు నాటే ముందే సరైన స్థలాన్ని ఎంపిక చేసుకుని నాటితే ఇప్పుడు నరికి వేసే అవసరం ఉండేది కాదు. కానీ అధికారులు తమ టార్గెట్ల కోసం ఇష్టారీతిన మొక్కలు నాటారు. భవిష్యత్‌లోనైనా ఇలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా సరైన స్థలాన్ని ఎంపిక చేసుకుని మొక్కలను నాటాలని పలువురు కోరుతున్నారు.

మొదలునే నరికివేస్తున్న రైతులు

విద్యుత్ తీగలకు ఇబ్బందికరంగా ఉన్నాయంటూ ట్రాన్స్‌కో అధికారులు కొమ్మలను నరకటానికి ప్రయత్నిస్తున్నారు. అదును దొరికింది కదా అని రోడ్డు పక్కన పంట భూములు ఉన్న రైతులు కొన్నిచోట్ల మొదలునే నరికి వేస్తున్నారు. మొదటికి చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. మొక్క దశలో ఉన్నప్పుడు మేకలు, గేదేలు మేస్తే యాజమానులకు కనీసం రూ.2 వేలు జరిమానా విధించాలన్నా అధికారులు, ప్రస్తుతం చెట్లను నరికి వేస్తే ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

రంగనాథస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు



మహాముత్తారం: మండలంలోని నల్లగుంట మీనాజీపేట గ్రామంలోని శ్రీ రంగనాథస్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. ఆలయం నిర్మించి తొమ్మిది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.